పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# మహిళ సాధికారతతోనే సమాజ అభివృద్ధి

## రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ...

**పాలకొల్లు ప్రభాతవార్త :**
మహిళా సాధికారిత తోనే సమాజాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు లైన్స్ కమ్యూనిటీ హాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా ఫౌండేషన్ చైర్మన్, మంత్రి రామానాయుడు కేక్ కోసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.సమాజంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న కాకినాడ జిల్లా పెద్దాపురం ఆర్డీవో శ్రీ కట్రెడ్డి రమణి,యలమంచిలి ఎంపీడీవో నందిపాటి ప్రేమాన్విత ,మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టరు శిరిగినీడి రాజ్యలక్ష్మిలతో పాటు వందమందికి పైగా మహిళలను సత్కరించి మంత్రి చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో మహిళలకు చదువు, సమాన అవకాశాలు, స్వయం సంపాదన, ఆర్థిక పరిపుష్టి ఉన్ననాడే అసలైన అభ్యుదయం %శీ% సాధించినట్లవుతుందన్నారు.గతంతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ మహిళా భాగస్వామ్యం పెరిగిందన్నారు.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ఆడపడుచులను.గౌరవించిన ఘనత,కీర్తి తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు.1982 వ దశకంలో అన్న ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడపడుచులకు అగ్ర తాంబూలం ఇవ్వడం జరిగిందని అందులో భాగంగానే ఆడపడుచులకు ఆస్తిలో సమాన హక్కు కల్పించడం జరిగిందని మంత్రి తెలిపారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పడ్డ ఎన్డీఏ కోటమీ ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమానికి రూ 4,332 కోట్లు కేటాయించిందన్నారు. విద్యా ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ కల్పించడం స్థానిక పదవుల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడం,చట్ట సభల్లో తగురీతిలో ప్రాతినిధ్యం కల్పించి గౌరవించడం వంటి ఎన్నో గొప్ప కార్యక్రమాలు తెలుగుదేశం హయాంలోనే జరిగాయన్నారు.స్వయం సహాయక సంఘాల సమగ్ర ఏర్పాటు ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేటట్టు చేసిన ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆడపిల్లలకు విద్యా ఉద్యోగ అవకాశాలు అధిక శాతం కల్పించడం, ఔత్సాహిక యువతులకు పారిశ్రామిక



వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహం ఇవ్వటం వంటి ఎన్నో అవకాశాలు కూటమి ప్రభుత్వం కల్పిస్తోందని, ఈ అవకాశాలు అన్నిటిని అందిపుచ్చుకుని గొప్పగా ఎదగాలని కోరుకుంటున్నానని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కర్నని రోజారమణి, పెచ్చేట్టి బాబు, బోనం చినబాబు,ఉన్నమట్ల కభర్ధి,గండేటి వెంకటేశ్వర రావు, కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు,బోనం నాని,కడలి గోపాలరావు,పీతల శ్రీనివాసు, బొప్పన హరికిషోర్, తులా రామలింగేశ్వరరావు, అరిమిల్లి చిన్ని తదితరులు మాట్లాడారు.

# భారతదేశంలో మహిళలకు ఉన్న గౌరవం ప్రపంచంలో ఏ దేశంలో లేదు



**భీమవరం మార్చి 8 ప్రభాతవార్త :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం ఉదయం భీమవరంలోని ప్రకాశం చౌక్ నుండి 600 మంది మహిళలతో ఏర్పాటు చేసిన ర్యాలీని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, ఏపి శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఆచంట ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి సంయుక్తంగా పింకు బెలూన్లు గాలిలోకి వదిలి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున మహిళలు, విద్యార్థినిలు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఆడపిల్లలు జాతికి సంపద, ఆడపిల్లలే జాతికి నిజమైన సంపద, ఆడపిల్లలు భారం కాదు కుటుంబానికి భరోసా, మగ, ఆడ లింగ నిష్పత్తిని కాపాడుకోవలసి అవసరం ఎంతైనా ఉందని అనే స్లోగన్లుతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ మన భారతదేశంలో మహిళలకు ఉన్న గౌరవం ప్రపంచంలో ఏ దేశంలో లేదని, చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆలోచన మహిళలు మీద ఉన్న గౌరవం తెలుపుతుందన్నారు. ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని మన భారతీయుల ప్రగాఢ విశ్వాసం అన్నారు. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాలలో విజయం సాధిస్తారని అన్నారు. మన దేశ ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ఒక మహిళ అని, అలాగే మన పశ్చిమగోదా జిల్లా కలెక్టరు కూడా ఒక మహిళ అని ఇది మంచి శుభపరిణామం అన్నారు. తన కుటుంబంలో ప్రతి ఒక్కరిని ఆర్థికంగా, సామాజికంగా, బలోపేతం చేయుటకు స్త్రీ పాత్ర కీలకం అన్నారు. అంతరిక్షంలోకి వెళ్ళుటకు మగవారితో పాటు మహిళలు పోటీ పడుతున్నారని, మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమి లేదన్నారు. రానున్న కాలంలో మహిళలు చురుకైన పాత్ర వహించి దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఏపి శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ మూర్తి అని, స్త్రీ లేకపోతే సృష్టి లేదన్నారు. దేవాలయంలో దేవుడి మీద భక్తి, కుటుంబంలో మహిళలు మీద గౌరవం ఉండాలన్నారు. మహిళలకు చట్టసభలో 33 శాతం, స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం ఆశయం అన్నారు. జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మహిళలు సముద్ర కెరటంలా తరలివచ్చి విజయవంతం చేయుడం శుభ పరిణామం అన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా రూ. 131.82 కోట్ల రుణాల పంపిణీ..

## - ఆకట్టుకున్న స్టాల్స్.. టైలరింగ్ నందు ఉచిత శిక్షణతోపాటు జీవనోపాధికొరకు కుట్టుమిషన్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం..



**ఏలూరు,మార్చి 8 ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సర్. సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ స్టాల్స్ ను శనివారం జిల్లా ఇన్ చార్జీ మంత్రి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), నగర మేయర్ నూర్జాహాన్ పెదబాబు, ఆర్ టి సి రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తదితరులు సందర్శించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార స్టాల్ మరింత ఆకట్టుకుంది. వివిధ స్వయం సహాయ సంఘాలు తయారుచేసిన వివిధ ఆహార ఉత్పత్తులు, జ్యూట్ బ్యాగులు తదితర స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీటితోపాటు వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కూడా స్టాల్స్ ఏర్పాటు చేశారు. మహిళల రక్షణ కొరకు మహిళా పోలీస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన అభయ మహిళా రక్ష స్టాల్ ను కూడా ఏర్పాటు చేశారు.

**రూ. 131.82 కోట్ల రుణాల పంపిణీ..**





డిఆర్డిఏ ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజి కింద మహిళా సంఘాలకు రూ.106.12 కోట్లు, పిఎంఎజెఎవై పథకం కింద రూ. 1.53 కోట్లు, పిఎంఎఫ్ఎంఎఫ్-పిఎంఇజిపి కింద రూ. 1.49 కోట్లు, మెప్మా ఆధ్వర్యంలో 181 మహిళా సంఘాలకు రూ. 17.43 కోట్లు, ప్రేరణాశక్తి కార్యక్రమం కింద నలుగురు ఉత్తమ వ్యాపారవేత్తలకు రెండు లక్షల రూపాయల చెక్కు, మెప్మా ఆధ్వర్యంలో నూతనంగా వ్యాపారం ప్రారంభించుకున్న350 మహిళలకు రూ. 5.25 కోట్లు, అందజేశారు. అదే విధంగా మహిళలకు ప్రత్యేకించి బి.సి. కార్పోరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ నందు ఉచిత శిక్షణతోపాటు జీవనోపాధికొరకు 4589 మంది మహిళలకు రూ. 11.47 కోట్లు విలువైన కుట్టుమిషన్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# మేజర్ సిటీగా ఏలూరును అభివృద్ధి చేస్తాం.

## ఎంపీ మహేష్ కుమార్ వెల్లడి.

**ఏలూరు, మార్చి 8, ప్రభాత వార్త :**
ఏలూరు నగరాన్ని మేజర్ సిటిగా అభివృద్ధి చేయడానికి స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో కలిసి కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన టిడిపి నియోజకవర్గస్థాయి సమావేశానికి ఎంపీ మహేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాజధాని అమరావతి అభివృద్ధితో ఏలూరు సిటీ కూడా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని ఎంపీ పేర్కొన్నారు. పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు చేయడానికి ఏలూరు జిల్లా అనువైన ప్రాంతంగా ఉందని, ఈ నేపథ్యంలో ఇక్కడికి పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ఇప్పటికే పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరిపినట్లు ఎంపీ తెలిపారు. రానున్న నాలుగేళ్లలో శాశ్వత నిర్దిష్టమైన ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఎంపీ వెల్లడించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి పెట్టామని, రాజకీయాలు చేయాలనుకుంటే చివరి ఆరు నెలలు సరిపోతుందని, ప్రస్తుతం నాయకులు కూడా అభివృద్ధి గురించే చర్చించాలని ఎంపీ సూచించారు. అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు ఒక్క మాట మీద ఉండాలని, నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య చెప్పినట్లు నడవాలని ఎంపీ సూచించారు. ఏలూరు నియోజకవర్గం



అభివృద్ధికి ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య ఎంతో కష్టపడుతున్నారని, నాయకులు, కార్యకర్తలు అడిగితే ఎమ్మెల్యే సొంత పనిలా చేస్తున్నారని ఎంపీ కొనియాడారు. ఎంఎల్ఏ బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ప్రజాసేవ చేసేందుకు రాయలసీమ నుంచి ఇక్కడికి వచ్చిన ఎంపీ మహేష్ కుమార్ ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత ఏలూరు వాసులుగా మనందరిపై ఉందని తెలిపారు. ఎంపీ మహేష్ కుమార్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి తనంత శక్తివంచ లేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎంఎల్ఏ పార్టీ శ్రేణులకు సూచించారు.

# అట్టహాసంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

## - పోరాటాలతో 11 సంవత్సరాలు

## -ఈ ఏడాది నుండి అభివృద్ధి పథం -ఎమ్మెల్యే నాయకర్



**ప్రభాతవార్త నరసాపురం :**
మార్చి 14న పిఠాపురంలో జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభకు నరసాపురం నియోజకవర్గం నుండి భారీ స్థాయిలో కార్యకర్తలు, అభిమానులు హాజరవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. శనివారం నరసాపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, నియోజకవర్గ స్థాయి జనసేన నాయకులు, మండల మరియు గ్రామ అధ్యక్షులు, జనసేన కార్యకర్తలు, వీర మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న హాజరై పార్టీ అభివృద్ధి, వేడుకల నిర్వహణపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ, జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, 11 సంవత్సరాలుగా పార్టీ ప్రజాసేవలో కొనసాగుతూ, 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఇప్పటి వరకు పోరాటాలతో కూడిన ఆవిర్భావ దినోత్సవాలు చూశామని, ఈ సంవత్సరం ప్రజల ఆశీర్వాదంతో విజయోత్సవంగా నిర్వహించనున్నామని అన్నారు. గత పదేళ్లుగా రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పవన్ కళ్యాణ్ అనేక ఉద్యమాలు నిర్వహించారని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న జనసైనికులు ఈ విజయోత్సవ వేడుకలో భాగస్వాములవ్వాలని కోరారు. సభ అనంతరం జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ చేయడంతో పాటు, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ చేసి మహిళలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి వర్ధనపు ప్రసాదు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, బందేల రవీంద్ర ,కొల్లాటి గోపికృష్ణ, గుబ్బల మారాజు,మైల వసంతరావు, వాతాడి కనకరాజు, దొడ్డపాటి స్వాములు, అడ్డల నాగేశ్వరరావు, నిప్పులేటి తారక రామారావు మరియు నియోజవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# మహిళాభివృద్ధి కి ప్రభుత్వ పథకాలను వినియోగించు కోవాలి.

**భీమవరం మార్చి 8 ప్రభాతవార్త :**
మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.శనివారం భీమవరం మండలం తుందుర్రు గ్రామంలోని లేస్ పార్క్ భవనంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ల శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా భవనంలోని ప్రతి గదిని పరిశీలించి కుట్టు మిషన్ల శిక్షణ తరగతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.



# మహిళలు సాధికారత సాధించిన నాడే దేశాభివృద్ధి

**ఆగిరిపల్లి మార్చి 8 ప్రభాతవార్త :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం దయాల రాజశేఖర్ గారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ అంతర్జాతీయ దినోత్సవం వేడుకలను వెలుగు డిపార్టెంట్ , ఐసిడిఎస్ డిపార్టెంట్ వారు కలిసి సంయుక్తంగా నిర్వహించారు. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆగిరిపల్లి టిడిపి నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందాలని తెలియజేశారు ప్రభుత్వం మహిళలకు అనేక పథకాలు అందిస్తోందని వాడి సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు.ఇండియన్ గ్యాస్ కంపెనీ అధినేత పాలడుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందు ఉండాలని తెలియజేశారు. ఏపిఎం దయాల రాజశేఖర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ మహిళలు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఆన్లైన్లో అందరూ కొనుగోలు చేయాలని కోరారు. ఏరియా కోఆర్డినేటర్ త్రిపుర సుందర్ రావు మాట్లాడుతూ లింగ వివక్షత ఉండకూడదని తెలియజేశారు. అనంతరం ఏపీఎం దయాల రాజశేఖర్ అధ్యక్షతన ఐదు రకాలైనటువంటి ఆటల పోటీలను మహిళలకు మ్యూజికల్ చైర్స్ లెమన్ అండ్ స్పూన్ విత్తనాలు ఏరుట బెలూన్స్ ఊదుట బజ్జీలు తినుట ఐదు రకాల పోటీలు నిర్వహించివారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను అతిథులచే బహుమతులు పంపిణీ చేయించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సులోచన రాణి మండల టిడిపి నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు చౌటపల్లి విక్టర్ బాబు , జోషి బాబు , నూజివీడు ఏసి శ్రీ త్రిపుర సుందర రావు గారు నూజివీడు ఏపిఎం ప్రసాద్ గారు మరియు ఆగిరిపల్లి కార్యదర్శి ప్రసాదు పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో పాల్గొన్నటువంటి సీసీలు వివోఏలు అంగన్వాడీ టీచర్లను మహిళలను సత్కరించారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల లో దరఖాస్తులకు గడువు పొడిగింపు

**ద్వారకా తిరుమల ప్రభాతవార్త :**
స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో 2025బ26 సంవత్సరానికి 5వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరాల్లో ప్రవేశానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మార్చి 6 నుండి 13 వరకు పొడిగించడం జరిగిందని గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు.ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాంఘిక



తమ కార్యాలయంలో కలిసిన సూర్య సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 2025బ26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరము (ఇంగ్లీష్ మీడియం) లో ప్రవేశానికి దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా సమర్పించడానికి మార్చి 13 వరకు పొడిగించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని 5వ తరగతి ప్రవేశాలకు 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్,రేషన్ కార్డుతో మీ దగ్గరలోని ఆన్లైన్ సెంటర్లలో లేదా గురుకుల పాఠశాలలో సంప్రదించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ లో 310 కేసులు పరిష్కారం.








**ప్రభాతవార్త నరసాపురం :** శనివారం స్థానిక కోర్ట్ ప్రాంగణంలో నిర్వహించిన. జాతీయ లోక్ అదాలత్ లో 310 కేసులు పరిష్కరించినట్లు నర్సాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు 10వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి పి. విజయ దుర్గ గారు తెలిపారు. ప్రింటింగ్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం, వల్లనే అయా కోర్టులలో పెండింగ్ లో ఉన్న కేసులు రాజీ చేయడం జరిగిందన్నారు. మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు ఇంతకుముందులా ఏలూరు జిల్లా కోర్ట్ కి వెళ్లకుండా ఇక్కడ నుండే మైక్రోసాఫ్ట్ టీమ్ యాప్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో మాట్లాడి రాజీ చేసుకోవడం విశేషం. ప్యానల్ లాయర్స్ పారా లీగల్ వాలంటీర్లు, మీడియా సహకరించడం వల్లనే ఈ సారి ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు తెలిపారు.ఈ అదాలత్ లో సివిల్ కేసులు...12, ఇన్యూరెన్స్ కేసులు.1, కుటుంబ తగాదాలు.5 నర్సాపురం టౌన్, రూరల్, మొగల్తూరు, యలమంచిలి పోలీస్ స్టేషన్ లకు సంభందించిన క్రిమినల్ కేసులు -66, ఎక్సైజ్ కేసులు..119 ,చెక్ బౌన్స్ కేసులు -09 BSNL -8 కేసులు , బరోడా బ్యాంక్ కేసులు..6 , బెంచ్ కోర్ట్ కేసులు 84 మొత్తం.. 310 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజి చేసినట్లు 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి పి. విజయ దుర్గ గారు పత్రికలకు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను 3 బెంచ్ లుగా ఏర్పాటుచేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్ వరలక్ష్మి, అదనపు.సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) శ్రీ కె. శ్రీనివాస్ , మరియు సభ్యులుగా చల్లా జ్యోతి, ఎ. నాగేశ్వరరావు, ఎస్. శ్రీధర్ ,బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. కోర్టు లైజన్ ఆఫీసర్ భాస్కరరావు, పోలీస్ అధికారులు మరియు సీనియర్ జూనియర్ న్యాయవాదులు, పి .ఎల్. వి రత్న సాగర్ పాల్గొన్నారు. మొత్తం కోటి పందొమ్మిది లక్షల తొంభై మూడు వేల ఏడు వందల రూపాయలకు అవార్డులను జారీ చేసినట్లు 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి పి. విజయ దుర్గ పత్రికలకు తెలిపారు. సీనియర్ న్యాయవాది కె.స్వామి నాయుడు కక్షిదారులకు అల్పాహారాన్ని అందించారు. తదనంతరం మహిళాదినోత్సవం సందర్భంగా మహిళా న్యాయవాదులు న్యాయమూర్తి పి. విజయ దుర్గ గారిని సన్మానించారు.

# అంగనవాడి టీచర్లకు సన్మానం

**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త :**
ఆర్డిఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ ఆదేశాల ప్రకారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఎంవి రమణ, తహసిల్దార్ స్లేవా జోజీలు పాల్గొని అంగన్వాడీ టీచర్లకు బహుమతులు అందజేశారు. జంగారెడ్డిగూడెం ఐ సి డి సి ఎస్ పిఓ పి బ్యూలా పలువురు అంగన్వాడీ టీచర్లను ఈ సందర్భంగా సన్మానించారు.



# చిన్న వెంకన్న ఆలయ సాయంకాల అర్చనలో మార్పు

**ద్వారకా తిరుమల ప్రభాతవార్త :**
చిన్న వెంకన్న ఆలయ సాయంకాల అర్చన సమయాన్ని మార్పు చేస్తున్నట్లు దేవాలయ ఈ వో యన్ వి యస్ ఎన్ మూర్తి తెలిపారు. ప్రస్తుతం సాయంత్రం 5గంటల నుంచి గం6:30 నిల వరకు సాయంకాలం జరుగుతుంది.ఈ నెల అనగా 14వ తేదీ శుక్రవారం సాయంత్రం నుంచి సూర్యస్తమయం కాల మార్పు అనుసరించి సాయంత్రం గం5:30నిల నుంచి రాత్రి 7:00 గంటల వరకు నిర్వహిస్తామని ఈ వో తెలిపారు.ఈ సమయంలో భక్తులకు స్వామివారి దర్శనం లభించిందన్నారు. కావున భక్తులు గమనించగలరు.

## కృషి పట్టుదలతో మహిళలు రాణించాలి.




అత్తిలి - మార్చి 8 ( ప్రభాత వార్త ): కృషి , పట్టుదలతో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని అత్తిలి ప్రాధమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫి.సురేఖ అన్నారు. అత్తిలి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సురేఖను సత్కరించారు. స్వయం శక్తి తో ఏ పని అయినా చేయటానికి ధైర్యం కలిగి ఉండాలన్నారు. డిగ్రీ , జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ పి శ్రీరామ్ శర్మ , డివి . రమణ మూర్తి అధ్యాపకులు పాల్గొన్నారు.

## విమెన్ పవర్ ఐకాన్ అవార్డు పొందిన రమణి



అత్తిలి - మార్చి 8 ( ప్రభాత వార్త ): అత్తిలి కి చెందిన తెలుగు ఉపాధ్యాయిని పెదపల్లి వెంకటరమణి విమెన్ పవర్ ఐకాన్ అవార్డు ను పొందారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లో విశ్వ ఆర్ట్స్, ఆర్కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ వారు అవార్డు తో రమణిని సత్కరించారు. ఆమె రాసిన పలు కవితలను గుర్తించి వివిధ సంస్థలవారు పలు సత్కారాలు చేసారు.

## బల్లిపాడు లో మహిళా దినోత్సవం .



అత్తిలి - మార్చి 8 ( ప్రభాత వార్త ): బల్లి పాడు మదన గోపాల్ స్కూల్లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్ దంపతులు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ టి . గీతా భారతి ప్రధానోపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరావు , ఇన్చార్జి ఆకుల శ్రీనివాసరావు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తపన ఫౌండేషన్ సౌజన్యంతో...!
## మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం,



జీలుగుమిల్లి, మార్చి-08, ప్రభాతవార్త: మండలంలోని బర్రింకపాడు ఎమ్మెల్యే చిర్రి క్యాంపు కార్యాలయం వద్ద తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను ఎమ్మెల్యే బాలరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ తో కలిసి గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తపన చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ గిరిజన అభివృద్ధిపై ఎంతో అంకితభావం కలిగి ఉన్నారని అన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే గిరిజనులకు అండగా ఉండటం అదృష్టంగా భావించాలన్నారు. ఎమ్మెల్యే బాలరాజు గెలిచినప్పుడే తాగునీటి సమస్య గురించి తనను సంప్రదించారని అన్నారు. ఇందుకు తపన ఫౌండేషన్ నుండి సహకారం అందించాలని కోరారు అన్నారు. ఎమ్మెల్యే బాలరాజు కోరిక మేరకు ఆర్ఓ ప్లాంట్ నిర్మించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. అడిగిన వెంటనే మినరల్ వాటర్ ప్లాంట్ వాటర్ ట్యాంకర్ ను అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తపన ఫౌండేషన్ ద్వారా ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.

అంతకు ముందు తపన చౌదరి శ్రీ జగదంబ ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్, బిజెపి జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్, జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరావు, టిడిపి మండల అధ్యక్షుడు సాయికృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, బిజెపి మండల అధ్యక్షుడు గుడ్ల రాంబాబు, ఎంపీటీసీ నాలి శ్రీను, కూటమి నాయకులు కొండేపాటి రామకృష్ణ, కక్కిరాల మురళి, దారా మధు, వి కాంచనమాల తపన ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



జీలుగుమిల్లి, మార్చి-08, ప్రభాతవార్త: మండల కేంద్రం జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో స్థానిక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యురాలు డా.బి గాయత్రి, పీహెచ్ఎన్ కుంజా నాగమణి, హెల్త్ సూపర్వైజర్స్ మిడియం చంద్రకాంత, పొట్టా నాగరత్నం, స్టాఫ్ నర్స్ రమాదేవి, వైద్య సిబ్బంది సువర్ణ, మంగాయమ్మ తదితరులకు పాలడుగుల రామకృష్ణ, బొంతు రామకృష్ణ, బొంతు వెంకట రామారావు, కడిమి సాయి, బొంతు రాంబాబు, నక్క శ్రీను, దార మనోజ్, బొ లగాని, సత్తిబాబు చాలా వంశీ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు వైద్య సిబ్బంది ప్రెస్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం ఆర్ ఎఫ్ చెక్ పంపిణి చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి



ద్వారకాతిరుమల ప్రభాతవార్త : మండలంలోని కోడిగుడెం గ్రామానికి చెందిన రాజులపాటి నాగేశ్వరావు కి శనివారం గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ ప్రెసిడెంట్ గురజాల చంద్రరావు, తెలుగుదేశం నాయకులు అప్ప సాని శ్రీధర్ బాబు, బిజెపి నాయకులు సాధనాల సర్వే రావు, తాడేపల్లి పౌలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## సేవా సంస్థల ద్వారా గ్రామంలో ఉచిత వైద్య పరీక్షలు




ప్రభాతవార్త కొయ్యలగూడెం మార్చ్ 8: ట్రైబల్ రూరల్ అర్బన్ సర్వీస్ సొసైటీ ద్వారా ఉండ్రాజవరపు రూతు శ్రీదేవి ఆధ్వర్యంలో పొంగుటూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. డాక్టర్ శివకుమార్, డాక్టర్ పవన్ గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ గోకలే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సేవా సంస్థల ద్వారా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలంతా వినియోగించుకోవాలని, వైద్యులు ఇచ్చిన సూచనలు మేరకు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బొబ్బర రవి, వీఆర్వో రమేష్, ఉండ్రాజవరపు ప్రభావతి, ఉపాధి రాజ్ కుమార్, కొడమంచిలి డేవిడ్ రాజ్, గెడ్డం మిలోర్డ్ , సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవానికి కైకలూరు నుండి భారీగా తరలి వెళ్ళాలి



కైకలూరు మార్చి 8 (ప్రభాతవార్త): కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈనెల 14న జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని జనసేన నాయకులు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం కైకలూరు పట్టణంలోని సీతారామ ఫంక్షన్ హాల్ నందు కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబి) అధ్యక్షతన జనసేన పార్టీ కైకలూరు నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త రెడ్డి అప్పలనాయుడు, కైకలూరు నియోజకవర్గ ఆవిర్భావ దినోత్సవ అబ్జర్వర్ చనుమిల్లి చంద్రశేఖర్లు హాజరయ్యారు. ప్రధమంగా ఆవిర్భావ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలి వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని, జన సమీకరణతో వెళ్లేందుకు జనసైనికులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగోపుల చలపతి, ఏ ఎన్ బాబు, తోట లక్ష్మి,శాంతి రాజేశ్వరి,సిరివరపు రాజబాబు, బెల్లంకొండ వెంకన్న బాబు, మైగాపుల రామాంజనేయులు,నానాజీ, వీరంకీ వెంకయ్య,కడిమి శివ బాబు,తులసి పూర్ణ,బోయిన రాజేష్, చెన్నం శెట్టి నందకిషోర్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భాష్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**పెనుమంట్ర, మార్చి-08, ప్రభాతవార్త:** పెనుగొండ భాష్యం పాఠశాలలో ఎంతో "అంతర్జాతీయ మహిళ దినోత్సవ" వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినీ-విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయినులు ఆడి పాడి సరదాగా గడిపారు. చిన్నారులు స్త్రీ శక్తి ని తెలియజేస్తూ నిర్వహించిన నారి అనే మానవహారం ఎంతో ఆకర్షణీయంగా నిలిచింది. అనంతరం ప్రిన్సిపల్ ఎన్ వెంకట అప్పారావు మాట్లాడుతూ, కళ్ళు తెరిచిన క్షణం నుండి బంధం కోసం బాధ్యత కోసం కుటుంబం కోసం అందరినీ కనుపాపలా తలచి ఆత్మీయత పంచుతూ, తన వారి కోసం అహర్నిశలు కష్టిస్తూ వారి భవిష్యత్తు గురించి తన ఇష్టాలను వదులుకొని, కష్టాలను కూడా ఇష్టంగా మార్చుకుని, తన బాధను- వేదనను మునిపంట అదిమిపట్టి, తన వారి కోసం అహర్నిశం శ్రమించే ప్రతి స్త్రీ హృదయం స్వచ్ఛమైనదనీ అన్నారు. అంతేకాకుండా మహిళ శక్తివంతమైనదని, ఆమె నిస్వార్థ ప్రేమ ఈ ప్రపంచానికి మర్యాద అని అన్నారు. స్త్రీ గౌరవాన్ని జోడిస్తూ,ప్రతి ఇంటిని నందనవనం చేసే త్రిమూర్తులందరికీ ఇంటిని ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా సాగించడం కత్తి మీద సాము లాంటిది అలా ఇంటిని ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ తమ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములైన మా మహిళా ఉపాధ్యాయినిలకు మరొక మారు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇంచార్జ్ ఏ శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇంచార్జ్ రాణి రోజాజీ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న వెంకన్న స్వామి సన్నిధిలో ఆర్డీవో రమణ



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : ద్వారకా తిరుమల లోని చిన్న వెంకన్న స్వామి సన్నిధిలో శనివారం జంగారెడ్డి గూడెం ఆర్డిఓ ఎంవి రమణ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. వేద ఆశీస్సులు అందుకున్నారు.

## మద్దిలో పంచామృత అభిషేకాలు



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : మండలంలోని గుర్వాయిగూడెంలో ని శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించు అభిషేక సేవా సందర్భంగా ఆలయ ముఖ్ మండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచ అమృత అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం వరకు దేవ స్థానమునకు వివిధ సేవల రూపేణా రూ.1,05, 459 లు సమకూరింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ పర్యవేక్షకులు జువ్వాది కృష్ణ, కూరగంటి రంగారావు పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు గావించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆర్ వి.చందన తెలిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : మండలంలోని నాగులగూడెం కు చెందిన లాగు రవి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందాడు. లక్కవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి,



పెనుమంట్ర, మార్చి-08, ప్రభాతవార్త: భీమవరంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన 2కె వాక్ లో మహిళలు మరియు బాలికలతో కలసి మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ ఎమ్మెల్యే పితాని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, , జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ ఆద్నాన్ నయీం అస్మీ తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



లింగపాలెం మార్చి-08, ప్రభాతవార్త: ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ములగలంపాడు గ్రామంలో ఉన్నటువంటి ఇండియన్ పబ్లిక్ స్కూల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదని ప్రతి ఒక్కరు మహిళల సంక్షేమానికై పాటుపడాలని మహిళా సాధికారతనం సాధించాలని తెలియజేస్తూ పాఠశాలలో పనిచేస్తున్నటువంటి మహిళా ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు సమక్షంలో కేక్ కటింగ్ చేసి మహిళా ఉపాధ్యాయులను సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం జరిగింది

## మాతృమూర్తులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.



ప్రభాతవార్త కొయ్యలగూడెం మార్చి 8:అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాలా దేవిని, కొయ్యలగూడెం పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేఘాలా దేవి మాట్లాడుతూ మహిళలు గృహిణి మరియు ఉద్యోగాలలో, రాజకీయ రంగాలలో ప్రవేశించి తమ సత్తా చాటి చెప్పి , దేశానికే ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త రమ, శశికళ, మణి , సంధ్యారాణి, తదితర మహిళలు పాల్గొన్నారు.

## సమానత్వం కోసం పోరాడుదాం, సిపిఐ మండల కార్యదర్శి బాడిశ.రాము



వేలేరుపాడు,ప్రభాత వార్త : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వేలేరుపాడు మండల పార్టీ ఆధ్వర్యంలో , ఇప్పల గుంపు,ఉదయ నగర్, జీడిగింపు,రామవరం, రెడ్డిగూడెం,బండలబోరు, మల్లారం,భూదేవి పేట, జిన్నెలగూడెం, మద్దిగట్ల పాత, పూచిర్యాల,పూచిర్యాల కాలనీ కన్నయి గుట్ట, శాఖపల్లి కొత్తూరు పాత రెడ్డిగూడెం, శాఖలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను జెండా ఆవిష్కరించుకుంటూ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాడిశ. రాము మాట్లాడుతూ సమాజంలో మహిళలు అనేక ఇబ్బందులను సమస్యలను ఎదుర్కొని నేటి సమాజంలో ఆధునిక మహిళగా అనేక విజయాలు సాధించడం వెనుక ఎన్నో పోరాటాలు జరిగాయని తెలిపారు. 76 ఏళ్ల స్వాతంత్ర దేశంలో మనువాద అకృత్యాలైన సతీసహగమనం బాల్యవివాహాలు వంటి సామాజిక దురాచారాల నుండి బయటపడి నేడు సమాజంలో స్త్రీ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుటకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. 114వ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలంతా సమాజంలో స్వేచ్ఛ ,స్వాతంత్ర్యం తోపాటు సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు కరటం. సీతామాలక్ష్మి, మడకం.సునీత తోపాటు కారం.కుమారి, పిట్టా.సాయమ్మ, పిట్టా. దేశమ్మ,పిట్టా. జయ, మనకం దేశమ్మ,చుక్కమ్మ,సాయమ్మ, గంగాదేవి ,పాండా.భారతి, సోడే. సూర్య కుమారి,సోడే. లత, సోడే. నాగమణి, వెంకమ్మ,విజయ దుర్గ,సోది చిన్నమ్మి, కారం.రాజమ్మ, మిరియాల. సుబ్బలక్ష్మి, రాములమ్మ,సోయం. మంగా, మిరియాల.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

## ముత్యాలపల్లి గ్రామపంచాయతీ నందు ప్రపంచ మహిళా దినోత్సవం వేడుకలు



మొగల్తూరు మార్చి 8 ప్రభాతవార్త. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి పంచాయతీ నందు శనివారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు ముఖ్యఅతిథిగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగరాణి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలోనూ రాణించాలని ప్రతి మహిళ నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలని ఆమె అన్నారు అనంతరం ముత్యాలపల్లి గ్రామపంచాయతీ నందు విశిష్ట పారిశుధ్య సేవలందించిన క్లాప్ మిత్ర అయిన శ్రీమతి ఎస్తేరు రాణిని సాలువాతో మరియు మెమెంటో తో సన్మానించారు ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామ పెద్దలు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## నేడు ఉచిత మెడికల్ క్యాంపు



పెనుమంట్ర, మార్చి-08, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు శ్రీకృష్ణ నర్సింగ్ హోమ్ నందు చిర్ల వెంకటరెడ్డి మెమోరియల్ సారధ్యంలో గ్రామానికి చెందిన హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యులుగా విధులు నిర్వహిస్తున్న చిర్ల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు ఉచిత మెడికల్ క్యాంపు జరుగును. ఈ క్యాంపు నందు మోకాలి నొప్పులు, నడుము నొప్పులు, కీళ్ల నొప్పులు, మెడనొప్పి, వెన్నునొప్పి, ఆర్థరైటిస్ కండరాల నొప్పి, భుజం నొప్పి, సర్వేకల్ స్పాండిలిటీస్ తదితర వాటిని వైద్యులు చూస్తారు. ఈ క్యాంపులో మెడిసిన్స్ పై 50% రాయితీ ఇవ్వబడును. అదేవిధంగా ఎముకల సాంద్రత (బిఎండి) పరీక్ష ఉచితంగా చేయబడును. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీకృష్ణ నర్సింగ్ హోమ్ తెలిపింది.

## ఘనంగా మహిళా దినోత్సవం



ప్రభాతవార్త కొయ్యలగూడెం మార్చి 8 : సృష్టికి మూలం స్త్రీ అనే స్త్రీలు అన్ని రంగాలలో మగవారితో సమానంగా ఉంటున్నారని పరింపూడి గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళ పారిశుధ్య కార్మికులను, సచివాలయ మహిళ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. మహిళా పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. సచివాలయాల మహిళా ఉద్యోగులకు బహుమతులను అందజేశారు. మహిళలు అన్ని రంగాలలో ధైర్యంగా ముందుకు వెళ్లాలని సురేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి చిన్నబాబు, సచివాలయాల సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా లింగపాలెం మహిళలకు వీఆర్వోలకు సన్మానం



లింగపాలెం ఫిబ్రవరి 8 ప్రభాతవార్త.....మహిళ దినోత్సవ సందర్భంగా లింగపాలెం తహసిల్దార్ వారు కార్యాలయం నందు మహిళ ఉద్యోగులను సన్మానం తాసిల్దార్ ప్రసాద్ మహిళా వీఆర్వోలకు సన్మానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి నాగబాబు మహిళ వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు

## నామినేటెడ్ పోస్టుల భర్తీ చేస్తాం: ఎమ్మెల్యే పితాని



పోడూరు, మార్చి-08, ప్రభాతవార్త: నామినేటెడ్ పోస్టులను ఈ నెలాఖరులోపుగా భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు మండలం కొమ్ము చిక్కాల క్యాంపు కార్యాలయంలో ఆచంట నియోజకవర్గం కూటమి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. దళ్వా సాగుకు వంతులు వారీగా సాగునీరు సరఫరా చేయడంతో శివారు భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆయికట్టుకు పూర్తిస్థాయి సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆచంట నియోజకవర్గంలో మహిళలకు టైలరింగ్ లో శిక్షణ ఇచ్చి మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు పెనుమంట్ర, మార్టేరు, సిద్ధాంతం, పెనుగొండ, ఆచంట వల్లూరు, కేంద్రాల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. దాళ్వా పంట ధాన్యం విక్రయించే సమయానికి కొత్త గన్ని బ్యాగులు అందుబాటులోకి తీసుకురావాలని సమావేశం చర్చించింది. మరో మూడు రోజుల వ్యవధిలో నూతనంగా ఇల్లు కట్టుకునే లబ్ధిదారులు సచివాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. రెండు మూడు గ్రామాలు క్లస్టర్ గా ఏర్పాటు చేసి పాలన సాగించేందుకు ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన బిజెపి టిడిపి నాయకులు సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

